క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడిలో శ్రీకృష్ణ మందిర విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు మెరుగుమాల కాళీ పాల్గొన్ని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

21వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉప ఆలయాలు అయిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ భూనీలా సమేత శ్రీ జనార్దన స్వామి వార్ల 81వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈనెల 17న ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు 21వ తేదీ ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. 21న స్వామి వార్ల వసంతోత్సవం, త్రిశూల, చక్ర స్నానాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం దొంగల దోపు ఉత్సవం పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, గౌరవాధ్యక్షుడు చిన్నా, ప్రధాన కార్యదర్శి ఎస్. మురళీకృష్ణ, అదనపు కార్యదర్శి జగ్గారావు, కోశాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



పమిడిముక్కల: మామిళ్లపల్లిలోని శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చోడవరపు శివరత్నప్రసాద్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవంలో 12 జంటలు పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

నైతిక విలువలు ఉండాలి



గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన, నైతిక విలువలు కలిగి ఉండాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ దండమూడి సీతారామ స్వామి అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎస్‌జీఆర్‌కే మున్సిపల్ హైస్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహనతో పాటు సమాజం పౌరుల బాధ్యత అనే అంశంపై సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు పీవీ శేష గిరిరావు, హెచ్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

గుడివాడరూరల్: వలంటీర్లను సత్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు వందనం అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని గుడివాడ ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన వలంటీర్లకు వందన కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను సత్కరించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొంటారని పేర్కొన్నారు. గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండలంలోని వలంటీర్లను సత్కరించి నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేస్తారని తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పమిడిముక్కల: మండలంలోని లంకపల్లి, ఐనపూరు గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. బీఎల్వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు చేయటమే తమ కర్తవ్యమని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్లకు నిధుల మంజూరు

ముదినేపల్లి రూరల్: గతేడాది మిచౌంగ్ తుపానుతో దెబ్బతిన్న గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికారులు సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రోడ్ల పునరుద్ధరణకు ఒక్కొక్క మండలానికి రూ.28 లక్షల వంతున రూ.1.12 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే రోడ్లు నిర్మాణం చేపడతామని చెప్పారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణ పనులు

ప్రధాన రహదారుల పునర్నిర్మాణ పనులు వేగవంతం



జనార్దనపురం-కుదరవల్లి రోడ్‌లో గోతులు సరిచేస్తున్న పొక్లెయినర్



ఇటీవల అభివృద్ధి చేసిన నందివాడ-కుదరవల్లి రోడ్డు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం ప్రధాన రహదారి జనార్దనపురం-కుదరవల్లి రోడ్డు పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నందివాడ గ్రామం ఈ రోడ్డులో ఉండటంతో ప్రజల రాకపోకలు ఈ రోడ్డుపై ఎక్కువగా ఉంటాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్ల విషయం పట్టించుకోకపోవడంతో రోడ్లు కొన్ని ప్రాంతాలు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే కరోనా సమస్య తలెత్తడం, రెండేళ్లు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వం సైతం వీటిని మరమ్మతులు చెయ్యలేకపోయారు. తిరిగి రాష్ట్రం ఆర్థిక పరిస్థితులు మెరుగుపడిన అనంతరం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చొరవతో మండలంలోని ప్రధాన రహదారుల పునర్నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఇప్పటికే గుడివాడ-పోలుకొండ రోడ్డు తమిరిశ వరకు రూ.2.60 కోట్లతో అభివృద్ధి చేశారు. గతంలో జనార్దనపురం-కుదరవల్లి రోడ్ సుమారు రూ.1.5 కోట్లతో కొంతమేరకు రోడ్డు నిర్మాణం మరో రూ.30 లక్షలతో మరమ్మతులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి ఇదే రోడ్డును రూ.3 కోట్లతో పునర్నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభినందనీయం



ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉండేది. సుమారు 10 కిలోమీటర్ల ఈ రోడ్డుపై 30 టన్నులు పైబడి లోడ్ ఉన్న వాహనాలు చేపల చెరువులకు మేత తరలించడంతో గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణం కష్టంగానే ఉండేది. ప్రభుత్వం స్పందించి రూ.కోట్లు వెచ్చించి రోడ్డును పూర్తి స్థాయిలో పునర్నిర్మించడం అభినందనీయం.

– సరెళ్ల నాగేశ్వరరావు, నందివాడ

పలు రోడ్ల నిర్మాణం పూర్తి



నందివాడ మండలం మొత్తం రోడ్లు జనార్దనపురం-కుదరవల్లి, లింగవరం- పోలుకొండ, పోలుకొండ-లక్ష్మీనరసింహపురం-కుదరవల్లి గ్రామాల మధ్య విస్తరించి ఉన్నాయి. ఇందులో ఇప్పటికే లింగవరం-పోలుకొండ రోడ్డు పునర్నిర్మాణం పూర్తికాగా ప్రస్తుతం జనార్దనపురం-కుదరవల్లి మధ్య రోడ్డు రూ.3 కోట్లతో పునర్నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయం. మిగిలిన రోడ్డు నిర్మాణానికి సైతం నిధులు మంజూరు కావడంతో నందివాడ మండలంలో ప్రధాన రహదారులన్నీ అద్భుతంగా తయారవుతాయి.

– గోనె పాండురాజు, ఇలపర్రు

గ్రామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పామర్రులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రతి గ్రామం అభివృద్ధిపథంలో పయనించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక 8వ వార్డులో ఉరుటూరు నుంచి యాదవాపురం వరకు రూ.4.66 కోట్లతో నిర్మించే రహదారి ఏర్పాటుకు ఎమ్మెల్యే సోమవారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంలో భాగంగా సుమారు ఆరు కిలోమీటర్ల వరకు బీటీ రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి ఉరుటూరు గ్రామం మీదుగా సత్యనారాయణపురం, నల్లకుండ, ఆంజనేయపురం, కూర్మాపురం, యాదవాపురం, రాపర్ల ఎస్సీ కాలనీ వరకు ఈ రహదారి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రహదారుల ఏర్పాటుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తిప్పి కొట్టారు. కుల, మత, ప్రాంత, పార్టీ అని తేడాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనం అందరం కలిసి మళ్లీ గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం అక్కడి నుంచి కూర్మాపురం వరకు వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ సురేష్‌రెడ్డి, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పంచాయతీ రాజ్ డీఈఈ నాగరాజు, ఏఈఈ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తున్న వర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్

పెదపారుపూడి: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై వర్ల కుమార్ రాజా ఆధారాలు లేకుండా నోటికి వచ్చినట్లు అసత్య ప్రచారాలు చేస్తుంటే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోబోరని ఎంపీపీ గోగం సురేష్ హెచ్చరించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేపై వర్ల చేసిన వ్యాఖలను సోమవారం తీవ్రంగా ఖండించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని యలమర్రు గ్రామానికి వచ్చిన వర్లకుమార్ రాజా ప్రభుత్వ స్థలాల్లో ఎమ్మెల్యే కార్యాలయంలో డబ్బులు వసూలు చేశారని చౌకబారు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేశారని వర్ల నిరూపిస్తే తన ఎంపీపీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, నిరూపించకపోతే ఎమ్మెల్యేగా పోటీ చేయకుండా దూరంగా ఉంటావా అని వర్లకు సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు డేవిడ్, శ్రీధర్, వెంకటేశ్వరరావు, రమేష్, మురళి పాల్గొన్నారు.

సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వివిధ రకాల పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామికి వేద పండితులు విశేషాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు వేద పండితులు చేపట్టారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



గుడ్లవల్లేరు: ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. సోమవారం రెడ్డిపాలెం, గాదేపూడిలో జల జీవన మిషన్ కింద రూ.49 లక్షలతో కుళాయిల నిర్మాణం నూతన మంచినీటి పైపులైన్లు, కుళాయిల ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, సర్పంచ్‌లు జ్యోతిలత, లక్ష్మణరావు, కార్యదర్శులు సిహెచ్.ఉమామహేశ్వరరావు, ఎం.గోవర్ధనరావు, ఏఈ శివాజీ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



జుఝువరం(పామర్రు): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024లో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఉషోదయ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ పేర్కొన్నారు. మండలంలోని జుఝువరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్లో సోమవారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ నెల 18వ తేదీన మచిలీపట్నం కృష్ణాజిల్లా ఎస్పీ బంగ్లాలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో ముగ్గురు, ద్వితీయ స్థానంలో ముగ్గురు, తృతీయ స్థానంలో ఇద్దరు విజయం సాధించారు. కోచ్ వీవీఏ ఎస్.రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని సింగరాయపాలెం, గురజ జగనన్న కాలనీల్లో సోమవారం గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. జాప్యం లేకుండా బిల్లులు మంజూరవుతున్నాయన్నారు. కాలనీల్లో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'స్పందన'కు నాలుగు దరఖాస్తులు



గుడివాడ టౌన్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ మేనేజర్ ఐ. శ్రీనివాసులు, ఆర్‌ఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాముని జీవితం ఆదర్శం

పామర్రు: శ్రీరామచంద్రమూర్తి జీవితమే మన అందరికీ ఆదర్శం కావాలని పామర్రు వీరాంజనేయపురం శ్రీశ్రీశ్రీ గణపతి లక్ష్మీసరస్వతీ దేవాలయం వ్యవస్థాపకులు, కొండిపర్రు నాగరాజు సిద్ధాంతి పేర్కొన్నారు. పామర్రు నుంచి అయోధ్యకు వెళుతున్న పలువురు రామభక్తులకు శివరామ కాంప్లెక్సులోని ఎన్టీఆర్ స్టూడియో వద్ద సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన శ్రీరాములవారి మందిరాన్ని ప్రతిఒక్కరూ దర్శించాలన్నారు. పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు త్రివిక్రమరావు, డైరెక్టర్లు పసుపులేటి నరసింహారావు, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి మాద్రాపు ప్రసాద్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ 24 గంటలు పనిచేయాలి

మండవల్లి: మండవల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిపడా వైద్యులున్నా, నైట్ వాచ్‌మన్ లేడనే సాకుతో 12 గంటలు మాత్రమే పనిచేయడంపై ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో సోమవారం ఏఓ కె.గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, నర్సులు తగినంత సిబ్బంది ఉన్నా 24 గంటలు సేవలందకపోవడంతో రాత్రి సమయంలో మహిళలు ప్రసూతి వైద్యం తదితర సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పీహెచ్‌సీ 24 గంటలు పనిచేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయం



విశ్రాంత హెచ్‌ఎం ఆంజనేయశాస్త్రి దంపతులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

పమిడిముక్కల: ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయం, ఉదాత్తమైనదని హైదరాబాద్‌కు చెందిన రచయిత, కవి తంగిరాల చక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని కూడేరు దాసాంజనేయ స్వామి దేవస్థానంలో విశ్రాంత హెచ్‌ఎం పసుమర్తి ఆంజనేయశాస్త్రి, శారద విశాలాక్షి దంపతులకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం సహస్ర చంద్రదర్శన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసుమర్తి శ్రీనివాస్, నవులూరి ఉమాభారతి ప్రసాద్, అగస్త్యరాజు మురళీకృష్ణ పాల్గొన్నారు.

డోకిపర్రులో కొడాలి నానికి బ్రహ్మరథం



వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



కొడాలి నానికి హారతులు పట్టిన మహిళలు

గుడ్లవల్లేరు: డోకిపర్రులో అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి సోమవారం ఆ ప్రాంత ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రూ.40లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను కొడాలి నాని ప్రారంభించారు. అలాగే గ్రామంలో నాగేంద్ర స్వామి గుడి వద్ద కాలినడక నిమిత్తం ఐరన్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించారు. కొత్తపేటలోని బీసీ రామాలయం వద్ద జెడ్పీ నిధులు రూ.15 లక్షలతో కల్యాణ మండపానికి భూమిపూజ చేపట్టారు. భారీ జన సందోహంతో కాలినడకన ర్యాలీగా ప్రధాన వీధుల వెంబడి సాగిన ఎమ్మెల్యేకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు మండలి హనుమంతరావు, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, సర్పంచి గోసాల జ్యోతి, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఈఓ ఎస్.రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ బాజీ, సతీష్‌రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే డీఎన్నార్



లింగాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. పుట్లచెరువులో రూ.43.60 లక్షల జలజీవన్ పథకం నిధులతో నిర్మించిన మంచినీటి పథకానికి ఎమ్మెల్యే డీఎన్నార్ సోమవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని తాగునీటి పథకానికి రూ. కోటి వరకు నిధులు అందించినట్లు వివరించారు. గ్రామాలను మరింతగా అభివృద్ధి పరచాలంటే ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ప్రజలందరూ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, వైఎస్ ఎంపీపీ అగస్త్రీ ఆదివిష్ణు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ గురుగుబెల్లి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటనరసింహారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కూన శ్రీనివాసరావు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ పాల్గొన్నారు.

లింగాలలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు

మండలంలోని లింగాలలో రూ.15 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్ సోమవారం ఆవిష్కరించారు. తొలుతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ కమదన నాయనబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గరికపాటి రామ్మోహనరావు, శివాలయ చైర్మన్ రాజులపాటి యశోధనరావు, జంగం రాందాసు, సర్పంచ్‌లు జె వీరబాబు, ఎస్ థామస్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అయ్యంకిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అయ్యంకి(మొవ్వ): సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. వాటి అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు కట్టుబడి అమలు చేశామన్నారు. అందువల్లే ప్రతి ఇంటికీ గర్వంగా రాగలుగుతున్నాం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ నాగనబోయిన సునీల్, ఎంపీటీసీ సభ్యురాలు కాశీ విశ్వేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, మండల యూత్ కన్వీనర్ కొలుసు నరిసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండా



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వేములమడ(మొవ్వ): ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా రాష్ట్రంలో పాలన సాగుతోందని, మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం వేములమడలో రూ.43.6 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, సర్పంచ్ వేములమడ సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మురారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

కనుమూరు(పామర్రు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని కనుమూరు, నిమ్మకూరు గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అడ్వయిజరీ కమిటీ సభ్యులతో ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను మరింత మెరుగ్గా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

CHANGE OF NAMES

I, TIRUVEEDHULA VENUGOPALA KRISHNA (Old Name), S/o. TIRUVEEDHULA SATYANARAYANA (Old Name), M/o. TIRUVEEDHULA VIJAY LAKSHMI (Old Name), R/o. D.No.3-73-2, Lingavaram Village, Gudivada Mandal, Krishna Dist., AP, India. I have changed my name and my father name & my mother name is known as THIRUVEEDULA VENU GOPALA KRISHNA (New Name), S/o. THIRUVEEDULA SATYANARAYANA (New Name), M/o. THIRUVEEDULA VIJAYA LAKSHMI (New Name) for all purposes.